క్లుప్తంగా

నేడు మంత్రి వేణు సమావేశం

రామచంద్రపురం: పట్టణంలోని శెట్టిబలిజ కల్యాణ మండపంలో శనివారం ఉదయం 10 గంటలకు 'మళ్లీ ఎందుకు జగన్ సీఎం కావాలంటే..' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర మంత్రి వేణుగోపాలకృష్ణ కార్యాలయం నుంచి శుక్రవారం ఓ ప్రకటన వెలువడింది. మంత్రి వేణు ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మండల సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని పేర్కొంది.

నేటి నుంచి కొత్త ఓటర్ల నమోదు

కె.గంగవరం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 4, 5 తేదీల్లో కొత్త ఓటర్ల నమోదు చేస్తున్నట్టు తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి గ్రామంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకూ బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. ఓటర్ల జాబితా పరిశీలనతో పాటు కొత్త ఓటర్ల నమోదు, ఓట్ల తొలగింపునకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఇంకుడు గుంతల ప్రాధాన్యాన్ని గుర్తించాలి



నేలటూరు జగనన్న కాలనీలో ఇంకుడు గుంత ప్రయోజనాన్ని వివరిస్తున్న ఉద్యోగులు

కపిలేశ్వరపురం: ఇంటి వద్ద ఇంకుడు గుంతల ప్రాధాన్యాన్ని గుర్తించాలంటూ సచివాలయ ఉద్యోగులు శుక్రవారం నేలటూరులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక జగనన్న కాలనీలో ఇంకుడు గుంతల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలోని బృందం సభ్యులు వివరించారు. ఇంటింటికీ వెళ్లి ఇంకుడు గుంత నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.6 వేల సాయం లభిస్తోందని చెప్పారు. గుంత నిర్మాణం వల్ల పారిశుధ్య, ఆరోగ్య, సాంఘిక సమస్యలు తలెత్తవంటూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఇంజనీరింగ్ అధికారి నిమ్మకాయల పద్మరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ జామి వెంకటలక్ష్మి, మహిళా పోలీస్ గౌతమి పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



వలంటీర్‌కు నియామకపత్రం ఇస్తున్న ఎంపీపీ నాగమణి

కె.గంగవరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు వలంటీర్లు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండల కేంద్రమైన కె.గంగవరంలోని ఎంపీపీ కార్యాలయం వద్ద శుక్రవారం కూళ్ల, సుందరపల్లి, కుందూరు గ్రామాల్లో కొత్తగా చేరిన వలంటీర్లకు ఆమె నియామక ఉత్తర్వులు అందించారు. లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రతి వలంటీర్ చూడాలన్నారు. పింఛన్ల పంపిణీలో అలసత్వం వహించరాదని కోరారు. ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, సుందరపల్లి కన్వీనర్ పిల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వ, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేసిన డీఎస్పీ

రామచంద్రపురం: పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ శ్రీధర్ కుమార్ ఆదేశాల మేరకు పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ శుక్రవారం తన కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించారు. వ్యాసరచన పోటీల్లో జీవీఎస్ఎస్ఎల్ గౌతమి(రాజీవ్ గాంధీ మున్సిపల్ హైస్కూల్) ప్రథమ, సీహెచ్ కీర్తి(రత్నంపేట మున్సిపల్ హైస్కూల్) ద్వితీయ, డి.విజయ రోజ్లిన్(చాకలిపేట మున్సిపల్ హైస్కూల్) తృతీయ బహుమతులు పొందారు. డిబేట్ విభాగంలో ప్రవీణ, కీర్తి సౌజన్య(మోడ్రన్ డిగ్రీ కాలేజీ) ప్రథమ, ద్వితీయ, శంకర్‌రావు (వీఎస్ఎం కళాశాల) తృతీయ బహుమతులు సాధించారు. రామచంద్రపురం పోలీస్ సర్కిల్ సిబ్బందికి నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పామర్రు పోలీస్‌స్టేషన్ పీసీ వి.సత్యనారాయణ ప్రథమ, రామచంద్రపురం పోలీస్‌స్టేషన్ డబ్ల్యూపీసీ ఎ.అమ్మాజీ ద్వితీయ, ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్ పీసీ పి.బాబ్జీకి తృతీయ బహుమతులను, ప్రశంసాపత్రాలను డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై డి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

మరో ఛాన్స్..!

- అర్హత ఆధారంగా ఓటు హక్కు నమోదు
- నేటి నుంచి రెండు రోజుల ప్రత్యేక శిబిరాలు
- ఇప్పటికే రెండు నియోజకవర్గాల్లో 4,13,395 ఓటర్లు
- జనవరి ఐదున తుది జాబితాకు కసరత్తు



ఓటర్ల జాబితా



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న మహిళా ఓటర్లు (ఫైల్)

కపిలేశ్వరపురం/రాయవరం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమైనది. అంతటి ప్రాధాన్యమున్న ఓటు హక్కును అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఇవ్వాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఎన్నికల కమిషన్ ఆదేశాలపై క్షేత్ర స్థాయిలో నమోదు ప్రక్రియను చేపట్టింది. నేటి నుంచి రెండు రోజుల పాటు అధికారులు పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటు నమోదు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

నమోదు షెడ్యూల్ ఇదీ..

ఇప్పటివరకు చేపట్టిన ఓటరు నమోదు కార్యక్రమాల నేపథ్యంలో ఇటీవల ముసాయిదా జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ జాబితాను పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించారు. ఇలా ఉండగా నూతన ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలంటూ ఎన్నికల కమిషన్ తాజాగా ఆదేశించింది. దీంతో ఈ నెల 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాల పేరుతో ఓటరు నమోదు శిబిరాలను నిర్వహించనున్నారు. నూతన ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల దరఖాస్తులను స్వీకరిస్తారు. జనవరి 5న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తారు.

ఇటీవల విడుదల చేసిన జాబితా ప్రకారం ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఆర్సీపురం రూరల్	27,981	28,307	01	56,289
ఆర్సీపురం అర్బన్	16,841	18,071	03	34,915
కె.గంగవరం	25,694	25,403	02	51,099
కాజులూరు	27,901	27,797	00	55,698
మండపేట రూరల్	30,450	32,015	03	62,468
మండపేట అర్బన్	22,515	24,918	00	47,433
రాయవరం	25,768	26,945	01	52,714
కపిలేశ్వరపురం	26,351	26,428	00	52,779
మొత్తం	2,03,501	2,09,884	10	4,13,395

ప్రత్యేక శిబిరాల నిర్వహణ

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద ఈ నెల 4, 5 తేదీల్లో శిబిరాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో బీఎల్‌ఓలను పర్యవేక్షించే అధికారులతో ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. వారి ఆదేశాలతో క్షేత్ర స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నారు. బూత్ లెవెల్ అధికారులకు క్షేత్ర స్థాయిలో పోలింగ్ స్టేషన్లను నిర్దేశించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకూ కేంద్రంలో ఫారం-6, 7 , 8 లను స్వీకరిస్తారు. నమోదు ప్రక్రియపై సాయంత్రం నాలుగు గంటలకు ఉన్నతాధికారులకు రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుంది. సూపర్‌వైజర్లు, సహాయ ఓటరు నమోదు అధికారులు కేంద్రాల్లోని విధులను పర్యవేక్షిస్తారు.

మండపేట నియోజకవర్గంలో పురుషులు 1,05,084 మంది, స్త్రీలు 1,10,306 మంది ఇతరులు నలుగురు మొత్తం 2,15,394 మంది ఓటర్లున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో పురుషులు 98,417 మంది, స్త్రీలు 99,578 మంది, ఇతరులు ఆరుగురు మొత్తం 1,98,001 మంది ఓటర్లు ఉన్నారు.

సమన్వయంతో ఓటరు నమోదు



ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలపై రెండు రోజులు పాటు పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటరు నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.

– కొమరం సూర్యారావు, తహసీల్దార్, కపిలేశ్వరపురం

జనరంజకంగా జగన్ పాలన



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: క్షేత్ర స్థాయిలో ప్రజా అవసరాలను గుర్తించి, వాటిని పరిష్కరించడం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి శుక్రవారం రాత్రి గ్రామంలోని కామాక్షి అమ్మవారి గుడి, సంత మార్కెట్ ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మాట్లాడారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ, బుక్‌లెట్లను అందజేశారు. స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలపై తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ ఐ.రాజు, ఈఓ సుబ్బారావుతో మాట్లాడి, పరిష్కార చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గత ఎన్నికల ముందు గ్రామంలోని కుర్రా వారి మెట్టలో ఇళ్ల స్థలాలు ఇస్తున్నట్టు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు స్లిప్పులు అందజేసి పేదలను మభ్యపెట్టారని పేర్కొన్నారు. ఆ మెట్టను లేఅవుట్‌గా మార్చి, జనవరి నాటికి పేదలకు ఇళ్ల స్థలాలుగా అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మట్టావారి సెంటర్‌లో ఎన్నో ఏళ్లగా పూరిళ్లలో నివసిస్తున్న వారికి త్వరలో పట్టాలు అందజేస్తామన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని చెప్పారు. ఆర్బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, ఎంపీటీసీలు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్, పెదపాటి ఉమామహేశ్వరరావు, పార్టీ నేతలు కుడిపూడి రాంబాబు, కొప్పిరెడ్డి ప్రసాద్, తుపాకుల ప్రసన్నకుమార్, అద్దంకి రమణ, గనిశెట్టి సత్తిబాబు, గంధం సూరిబాబు, కొప్పిరెడ్డి గిరిధర్, వినకోటి ప్రసాద్, వార్డు సభ్యులు అల్లంపలి కిషోర్, గండిమేను గోవిందు, చుక్కా సింహాచలం, చేబోలు కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

లాభసాటి సాగు ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- కేశవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: వ్యవసాయం లాభసాటి చేయడమే లక్ష్యంగా రైతుల అభ్యున్నతికి వైఎస్సార్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని కేశవరం సొసైటీ వద్ద ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ రైతుల కష్టం దళారులు, మిల్లర్ల పాలవ్వకుండా, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక మార్పులు తెచ్చారని వివరించారు. ధాన్యాన్ని ఆర్బీకేకు అప్పగించిన వారం, పది రోజుల్లోనే రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తున్నారన్నారు. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి కోసం యాంత్రీకరణకు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. సస్యరక్షణలో రైతులకు చేయూతగా ఆర్బీకేకు డ్రోన్లు అందిస్తున్నారని తెలిపారు. వీటి నిర్వహణపై సిబ్బందికి ప్రభుత్వం శిక్షణ ఇస్తోందని వివరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ పథకాల ద్వారా కేశవరంలోని రైతులకు గత నాలుగేళ్లలో రూ.12.7 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని రైతులు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, ఆర్బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, ఎంపీటీసీలు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, పర్సన్‌లు చంద్రమళ్ల ఎస్సయ్య, చేబోలు పోసుబాబు, పార్టీ నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్, తుపాకుల ప్రసన్నకుమార్, అద్దంకి రమణ, గనిశెట్టి సత్తిబాబు, బందెల సాయిరాం, రైతులు సలాది శివన్నారాయణ, పెదపాటి ఉమామహేశ్వరరావు, అమ్మన్న పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ధ్యేయంగా పనిచేయాలి



ధాన్యం కొనుగోళ్ల వివరాలు చెబుతున్న టెక్నికల్ అసిస్టెంట్ శివకృష్ణ

రాయవరం: ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా, రైతు శ్రేయస్సే ధ్యేయంగా రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు సిబ్బంది పనిచేయాలని తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు, మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ ఆదేశించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలుపై టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. తహసీల్దారు ప్రకాష్‌బాబు మాట్లాడుతూ ధాన్యం శాంపిళ్లను సేకరించడం, వాటి నాణ్యత ప్రమాణాల మేరకు నిర్ణీత మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడం సిబ్బంది విధి అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వ్యవసాయ, రెవెన్యూ, సహకార, పౌర సరఫరాల శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ మాట్లాడుతూ మండలంలో 14,643 ఎకరాల్లో రైతులు వరి పంటను వేశారన్నారు. 19 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సాధారణ రకం 75 కేజీల బస్తాకు రూ.1,637, సన్న రకాలు(ఏ గ్రేడ్)కు రూ.1,652 మద్దతు ధరగా నిర్ణయించినట్టు తెలిపారు. నాణ్యతా ప్రమాణాల అంశంపై పౌర సరఫరాల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ శివకృష్ణ వివరించారు. తేమ 17 శాతం లోపల ఉండి, వ్యర్థ పదార్థాలు, మట్టి, రాళ్లు, చెడిపోయిన, రంగుమారిన, మొలకెత్తిన, వంకర తిరిగిన గింజలు ప్రభుత్వం నిర్ణయించిన గరిష్టశాతం కన్నా తక్కువ ఉంటే.. ఆ ధాన్యానికి మద్దతు ధర వస్తుందన్నారు. వీఆర్వోలు రైస్‌మిల్లుకు వచ్చిన ధాన్యం లోడును వెంటనే అన్‌లోడ్ చేయించడమే కాకుండా, లాగిన్‌లో అప్రూవల్ చేసి, మిల్లర్లతో ధాన్యానికి ఎక్నాలెడ్జ్‌మెంట్ చేయించాలన్నారు. సమావేశంలో సహకార సిబ్బంది, వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అంగన్‌వాడీ జిల్లా మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

మండపేట: అంగన్‌వాడీ జిల్లా మహాసభలు మండపేటలో ఘనంగా మొదలయ్యాయి. సీఐటీయూ ఆధ్వర్యంలో డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, సీఐటీయూ అనుబంధ సంఘాల సభ్యులు మండపేటకు తరలివచ్చారు. రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక బస్టాండు వద్ద నుంచి కలువపువ్వు సెంటర్ వరకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.కృష్ణవేణి ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టౌన్ హాలు వద్ద కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను 1975లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. 13 లక్షల అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలు అందిస్తోందన్నారు. సంక్షేమ బడ్జెట్‌ను కుదించడం ద్వారా ఐసీడీఎస్ బడ్జెట్‌లో కోతలు పెడుతోందన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళలను కించపరుస్తోందని, రెజర్లు, మణిపూర్ సంఘటనలు దీనికి నిదర్శనమన్నారు. అంగన్‌వాడీల కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, టీఏ, హెచ్ఆర్ఏ చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డిసెంబరులో దేశ వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ, సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు కొవ్వూరు గోపాలకృష్ణారెడ్డి, నూకల బలరాం, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

కాజులూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈ నెల ఐదున సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రజా రక్షణభేరి బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, బస్సు యాత్ర మండల కన్వీనర్ వల్లు రాజబాబు కోరారు. శుక్రవారం వారు మండల గ్రామాల్లో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని పేరేపించడం వల్ల దేశంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని పేర్కొన్నారు. బస్సుయాత్ర ఐదో తేదీ సాయంత్రం కాకినాడ ఇంద్రపాలెం లాకుల నుంచి బయలుదేరుతుందని వారు తెలిపారు.

బోళ్లంక భూముల పరిశీలన

కపిలేశ్వరపురం: గోదావరి నదిలోని బోళ్లంక భూములను శుక్రవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. బోళ్లంక భూములను సాగు చేసుకునేందుకు తమకు అనుమతి ఇవ్వాలంటూ పూర్వపు బోళ్లంక భూముల సాగు రైతుల పేరుతో కొందరు అర్జీ అందజేశారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కపిలేశ్వరపురం తహసీల్దార్ కొమరం సూర్యారావు, కపిలేశ్వరపురం, కొత్తపేట రెవెన్యూ సిబ్బంది ఈ భూములను పరిశీలించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



జగన్నాయకులపాలెంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రామచంద్రపురం రూరల్: మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన లబ్ధిదారులకు సూచించారు. జగన్నాయకులపాలెం, ద్రాక్షారామ లేఅవుట్లలో ఆమె పర్యటించారు. లబ్ధిదారులకు స్థలం ఉచితంగా ఇవ్వడంతో పాటు హౌసింగ్ లోన్, డ్వాక్రా సంఘం లోన్, ఇసుక, సిమ్మెంట్, ఐరన్ తదితర సామగ్రి కూడా ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. సర్పంచ్‌లు అనిశెట్టి రామకృష్ణ, కొత్తపల్లి అరుణ, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పరీక్షను పరిశీలించిన డీవైఈఓ




రాయవరంలో 'సీస్' పరీక్షను పరిశీలిస్తున్న రామచంద్రపురం డీవైఈఓ నరసింహఫణి

రాయవరం: దేశవ్యాప్తంగా నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా రాయవరం మండలంలో శుక్రవారం 3, 6, 9 తరగతులకు పరీక్ష నిర్వహించారు. మండలంలో ఎంపిక చేసిన 20 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించిన ఈ పరీక్షల తీరుతెన్నులను రామచంద్రపురం డీవైఈఓ నరసింహఫణి పరిశీలించారు. రాయవరంలో జెడ్పీ ఉన్నత పాఠశాల, సాయితేజా విద్యానికేతన్, భాష్యం, వివేకానంద పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవోలు పి.లక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణకు సూచించారు. సోమేశ్వరం జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న పరీక్షను సమగ్ర శిక్షా ఏఎంవో పి.రాంబాబు, డైట్ లెక్చరర్ ఎస్.బాలరాజు పరిశీలించారు.

అభ్యసన సామర్థ్యంపై పరీక్ష

కపిలేశ్వరపురం: మండలంలోని 26 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం అభ్యసన సామర్థ్యంపై పరీక్ష నిర్వహించారు. ఎంఈఓ కె.తాతారావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పరీక్షకు మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు.

విజ్ఞాన సముపార్జనకు చెకుముకి సైన్స్ సంబరాలు



చెకుముకి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హెచ్ఎం

కపిలేశ్వరపురం: బాలల్లో విజ్ఞాన సముపార్జన కోసం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాలు దోహదం చేస్తాయని వక్తలు పేర్కొన్నారు. వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం చెకుముకి సంబరాల వాల్‌పోస్టర్‌ను హెచ్ఎం ఎండీవీ లక్ష్మి ఆవిష్కరించారు. వేదిక ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 10న పాఠశాల స్థాయిలోనూ, 30న మండల, పట్టణ స్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, 2024 జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించనున్నట్టు వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. సంఘ ప్రతినిధులు సూర్యచంద్రరావు, సీహెచ్ బ్రహ్మాజీరావు, ఏపీ మంజుల, కె.జయశ్రీ, టీఎంజీ గాంధీ, వై.రాధాకృష్ణ, కేవీవీ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పానికి మేము సైతం..



పింజర్లగట్టు ప్రాంతాన్ని శుభ్రం చేసి, మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉద్యోగులు



దంగేరులో పారిశుధ్య కార్మికులతో కలిసి పరిసరాలను శుభ్రం చేస్తున్న ప్రజాప్రతినిధులు



శలపాకలో మొక్కను నాటుతున్న ఏసురాజు

రామచంద్రపురం రూరల్: 'స్వచ్ఛత–మన బాధ్యత' కార్యక్రమం శుక్రవారం ద్రాక్షారామలో నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ రూపొందించిన ఈ కార్యక్రమంలో మేము సైతం అంటూ ప్రజాప్రతినిధులు, పారిశుధ్య కార్మికులు, ఉపాధి హామీ కూలీలు, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా యానిమేటర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. అపరిశుభ్రంగా ఉన్న పింజర్లగట్టు ప్రాంతంలో చెత్త కుప్పలను తొలగించి, బ్లీచింగ్ చల్లారు. ఆ ప్రాంతంలో కొబ్బరి మొక్కలు నాటారు. పరిసర ఇళ్లను సందర్శించి, పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా(బాబ్జీ), వార్డు సభ్యులు డేగల వెంకటరమణ, కాలు కురచ ఏడుకొండలు, కొసనా భీమశంకరం, సాక్షి పద్మనాభం, పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, ఫీల్డ్ అసిస్టెంట్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వచ్ఛత అందరి బాధ్యత

కె.గంగవరం: తమ ఇళ్లను ఎలా శుభ్రంగా ఉంచుకుంటారో.. అదేతరహాలో గ్రామాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచేలా ప్రజలు సహకరించాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని దంగేరులో శుక్రవారం 'స్వచ్ఛత మనందరి బాధ్యత' కార్యక్రమం నిర్వహించారు. తొలుత ప్రజాప్రతినిధులు, పారిశుధ్య కార్మికులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఇళ్ల నుంచి వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలను నేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. కూరగాయలు, ఇతర వ్యర్థాలను ఇంటి పెరట్లో పాతిపెట్టి, ఎరువులుగా వినియోగించాలని సూచించారు. పారిశుధ్య కార్మికుల శ్రమను ప్రతిఒక్కరూ అభినందించాలన్నారు. ప్రస్తుతం పారిశుధ్య కార్మికుల కొరత ఉందని, 'స్వచ్ఛత' కార్యక్రమం ద్వారా వారిపై పనిభారం తగ్గుతుందని తెలిపారు. సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, ఉప సర్పంచ్ దారా సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత'తో ఆహ్లాదకర గ్రామాలు

కాజులూరు: రామచంద్రపురం నియోజకవర్గంలో రాష్ట్ర సమాచార, బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛత మన బాధ్యత' కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు అన్నారు. శుక్రవారం మండలంలోని శలపాక, పెనుమళ్లలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పోతుల గనిరాజు, సూరంపూడి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు, నాయకులు ఈ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు, ఉపాధిహామీ పథకం కూలీలు గ్రామంలో చెత్తకుప్పలను, పిచ్చిమొక్కలను తొలగించారు. పలుచోట్ల నాయకులు, అధికారులు మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీటీసీ దడాల రమేష్, ఎంపీడీఓ ఐ.రత్నరాజు, ఈఓపీఆర్డీ సీహెచ్ ఇందిరాదేవి తదితరులు పాల్గొన్నారు.